క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ నిర్మలజ్యోతి

జూలూరుపాడు: కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలజ్యోతి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై సీడీపీఓ నిర్మలజ్యోతి ఆరా తీశారు. సమయ పాలన పాటించాలని, రికార్డులు, రిజిష్టర్లు అప్‌డేట్‌గా ఉండాలని అంగన్‌వాడీ టీచర్లకు ఆమె సూచించారు. అదే విధంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూ నిర్వహించారు. మంగళవారం డీజీఎం పర్సనల్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ–5 నుంచి ఇరువురికి, ఏరియా వర్క్‌షాప్ నుంచి ఇద్దరికి కారుణ్య నియామకాల కోసం మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్, మృతి చెందిన వారి స్థానంలో వారసులకు, కుటుంబ సభ్యులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. వైద్య పరీక్షలకు పంపించి ఉత్తర్వులు అందజేస్తామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం వర్క్‌షాప్ విజయశేఖర్ బాబు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రీహరి, కృష్ణ, సాయి స్వరూప్ పాల్గొన్నారు.

వీర జవాన్లకు నివాళి



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న దృశ్యం

చుంచుపల్లి: పుల్వామా ఘటనలో మరణించిన 40మంది వీర జవాన్లకు చుంచుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో మూడ్ జయరామ్ నాయక్ ఆధ్వర్యంలో.. మంగళవారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ అధికారి కొత్తూరి సంజీవ్‌రావు మాట్లాడుతూ.. దేశ రక్షణలో సైనికుల పాత్ర మహోన్నతమైందన్నారు. దేశం కోసం కుటుంబాలను సైతం విడిచిపెట్టి దేశ రక్షణే జీవితంగా భావిస్తున్న వారి సేవలను కొనియాడారు. యువత అమర జవాన్లను ఆదర్శంగా తీసుకొని దేశం కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ దస్తగిరి, తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ చౌహాన్, గండపనేని సతీష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు బాలు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలో ఆరోగ్య మేళా

ఇల్లెందు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పల్లె దవాఖానాలలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం హెల్త్ మేళా నిర్వహించారు. మంగళవారం రొంపేడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగా, ధ్యానం, టీబీ, మలేరియా, లెప్రసీ, బీపీ, షుగర్ జబ్బుల గురించి డాక్టర్ కవిత వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్‌సీ తేల్చకపోతే సమ్మె చేస్తాం




మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు రావాల్సిన నూతన వేతన సవరణ అమలు కాకపోతే ఏ క్షణంలోనైనా మెరుపు సమ్మెకు దిగాల్సి వస్తుందని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పీఆర్‌సీ విషయంలో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నాయని, 16వ తేదీన నల్లబ్యాడ్జిలతో సీఎండీ డి.ప్రభాకర్‌రావును కలవడం జరుగుతుందని, చర్చలు సఫలం కాకపోతే మెరుపు సమ్మెకైనా సిద్ధమన్నారు. ఇందుకు జేఏసీ కలిసి కట్టుగా ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాయిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధీర్, అడిషనల్ సెక్రటరీ వరప్రసాద్, జనార్దన్ పాల్గొన్నారు.

పురోగతిలేని మన ఊరు - మన బడి

- నత్తనడకన అభివృద్ధి పనులు
- మండలంలో ఎనిమిది పాఠశాలలకు రూ.9.91 లక్షలు మంజూరు
- ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.1.13 కోట్లు



పునుకుల ప్రభుత్వ పాఠశాల

పాల్వంచరూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు – మన బడి పథకం అమలు చేస్తోంది. జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల, నాగారం ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, పునుకుల గ్రామంలో ప్రాథమిక పాఠశాల, యానంబైల్‌లో హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, తోగ్గూడెంలో ప్రాథమిక పాఠశాల, పాండురంగాపురంలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలకు మన ఊరు – మన బడి కింద అభివృద్ధి చేసేందుకు గతేడాది జూన్‌లో ఎంఏఎంపీ కింద రూ.90.91లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.1.13 కోట్లు మంజూరు అయినట్లు ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ రాజగోపాల్ తెలిపారు. ఈ నిధులతో పాఠశాలల్లోని తరగతి గదులు, వరండాలో ఫ్లోరింగ్, విద్యుత్ మరమ్మతులు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం, రంగులు వేయడం ఈ ఐదు అంశాలపై అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. కానీ ఆయా పాఠశాల్లో అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండంతో తొమ్మిది నెలలు గడిచినా పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. మండలంలో పునుకుల గ్రామంలోని పాఠశాలను మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేయాలని మన ఊరు – మన బడి కింద ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పాఠశాలల్లో తరగతి గదుల పైకప్పులను మార్చారు. విద్యుత్ మరమ్మతులు నిర్వహించారు.

మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెల రోజుల క్రితం కలెక్టర్ అనుదీప్ ఆకస్మికంగా పునుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను చూసి సంబంధిత అధికారులపై గరంగరం అయ్యారు. జనవరి నెలఖారు కల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా నేటికీ పనులు పూర్తి కాలేదు. మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేయాలని పాఠశాల ప్రాంగణంలో గార్డెన్ చేసి అందులో పూలు, పండ్ల మొక్కలను పెంచాలని ఆదేశించారు. ఇంతవరకు స్కూల్ ప్రాంగణాన్ని లేవల్ చేయలేదు. గార్డెన్ ఏర్పాట్లు లేవు. అదేవిధంగా జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలో విద్యుత్ మరమ్మతులు, తరగతి గదుల్లో ఫ్లోరింగ్ పనులు పూర్తి చేశారు. ఇంకా తరగతి గదుల్లో రంగులు వేయలేదు. వాటర్ ట్యాంక్ పనులు పూర్తి కాలేదు. నాగారం, యానంబైల్, తోగ్గూడెం, పాండురంగాపురం గ్రామాల్లోని పాఠశాలల్లో కూడా మన ఊరు – మన బడి పనులు నత్తనడకన సాగుతున్నాయి.



జగన్నాథపురంలో అసంపూర్తిగా మరుగుదొడ్లు

పనులు సాగుతూనే ఉన్నాయి



మన ఊరు – మన బడి కింద పునుకుల పాఠశాలను మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం, గార్డెన్ పనులు, ప్రాగంణ లెవల్ పనులు సాగుతూనే లేదు. ఎప్పటికి పూర్తి చేస్తారో అర్థం కావడం లేదు.

– ఉషారాణి, హెచ్ఎం, పునుకుల పాఠశాల

మోడల్ స్కూల్‌గా ఎప్పుడు మారుతుందో?



పునుకుల గ్రామంలోని పాఠశాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరానికైనా మోడల్ స్కూల్‌గా మారుతుందో లేదో. – కొండపల్లి ఉషామాధవి, పునుకుల

త్వరగా పనులు పూర్తి చేయాలి



మన ఊరు – మన బడి కింద ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను గడువులోపు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వెంటనే పనులు పూర్తి చేయించాలి.

– భూక్యా శ్రీనివాస్, జగన్నాథపురం

ఈనెల చివరికల్లా పూర్తి చేస్తాం



మండలంలో మన ఊరు – మన బడి కింద తొమ్మిది పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పునుకుల పాఠశాలను మోడల్ పాఠశాల కింద ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఈ నెల చివరికల్లా పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీరామ్మూర్తి, ఎంఈఓ

అభివృద్ధిలో భాగస్వాములవ్వండి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

జూలూరుపాడు: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలే తప్ప.. పనులను అడ్డుకుని అభివృద్ధి నిరోధకులుగా మిగలరాదని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సూచించారు. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయం నూతన పాలకవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మహాశివలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు, సభ్యులు ధరావత్ రవీంద్ర బాబు, ధర్మరాజుల వెంకటనారాయణ, బానోత్ సక్రు, సున్నం నాగమణి, కడియాల పుల్లయ్య, అరిగెల నరసింహారావుతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బేల్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ తనకు మళ్లీ టికెట్ ఇస్తే, ప్రజలు ఆశీర్వదిస్తే వైరా నియోజకవర్గంతోపాటు పాపకొల్లు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ భూక్యా కళావతి, ఈఓ చంద్రశేఖర్ హరి, అర్చకులు మధుకుమార్ శర్మ, ఓంకారాచారితో పాటు యదళ్లపల్లి వీరభద్రం, బానోత్ స్వాతి, పెండ్యాల రాజశేఖర్, పొన్నెకంటి సతీష్‌కుమార్, యల్లంకి సత్యనారాయణ, రామిశెట్టి రాంబాబు, కొమ్మినేని పాండురంగారావు, రోకటి రంగారావు, పెండ్యాల విజయభాస్కర్, పెండ్యాల ప్రసాద్, తొండెపు సుబ్బారావు, తొండెపు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

పాల్వంచ: ఇద్దరు విద్యార్థుల వైద్యానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్థిక సహాయం చేశారు. స్థానిక కేటీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సంతోష్ కంటి ఆపరేషన్ నిమిత్తం నగదును సేకరించారు. మంగళవారం కేటీపీఎస్ ఎస్ఈ యుగపతి, ఎస్ఈ శ్రీనివాసరావుల చేతుల మీదుగా సంతోష్ తండ్రికి రూ.26వేలు అందించారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థి మహేశ్ కంటి సమస్యతో తరచూ వైద్య పరీక్ష కోసం హైదరాబాద్ వెళుతుంటాడు. అతని ప్రయాణ ఖర్చుల కోసం రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వరరావు, ఏఈ కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పూర్ణచందర్‌రావు, ప్రేమ్‌కుమార్, మాధవి, మహాలక్ష్మి, హేమ, శ్రీలత, సైదులు, రాజశేఖర్, గంగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో...

కేటీపీఎస్ 7వ దశ కోల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన ముగ్గురు ఉద్యోగులకు ఆర్థిక సాయం అందించారు. ఎస్ఈ కార్యాలయంలో మంగళవారం కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ వెల్ఫేర్ క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు, ఎస్ఈ గుర్రం రాజ్‌కుమార్ గాయపడిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.25వేల చొప్పున రూ.75వేలు అందించారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన నలుగురికి రూ.10వేల చొప్పున రూ.40వేల అందజేశారు. కార్యక్రమంలో భిక్షపతి, భట్టు హరీశ్, ఆవుల కృష్ణారెడ్డి, డీఈ చంద్రు శ్రీనివాసరావు, బలరాం, రాంబాబు, హరిలాల్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న రాజ్‌కుమార్

పట్టు వీడని పేదప్రజలు..



రాజీవ్‌నగర్ తండా వద్ద గుడిసెవాసుల దీక్షలు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణ శివారు ప్రాంతంలో సీఎస్‌పీ బస్తీ శివారు రాజీవ్‌నగర్ తండా వద్ద మూడేళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. ప్రభుత్వం వీరిని పట్టించుకోవటం లేదు. దీంతో వారం రోజులుగా బాధితులు దీక్షలు చేపట్టారు. తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇళ్లకు హక్కు పత్రాలు అందజేయాలని వేడుకుంటున్నారు. వీరు నిర్వహిస్తున్న దీక్ష ఆరో రోజుకు చేరింది. మంగళవారం దీక్షలను సీపీఎం మండల కార్యదర్శి ఎస్ఏ నబీ ప్రారంభించారు. మాట్లాడుతూ.. రాజీవ్‌నగర్ తండా శివారు ప్రాంతంలో సాగుతున్న దీక్షలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ స్థలంలో పార్క్, హాస్టల్ భవన నిర్మాణం, మరోసారి మార్కెట్ కోల్డ్ స్టోరేజీ అంటూ పేదలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నంబర్లు, తాగునీరు, సదుపాయాలు కల్పించకపోవడం విడ్డూరం అన్నారు. అడవులలో జీవించే జంతువులకు నీటి సదుపాయం కల్పిస్తున్న ప్రభుత్వం రోడ్డు పక్కన జీవించే పేదలకు నీటి వసతి కల్పించేందుకు వెనకాడడం దుర్మార్గమన్నారు.

కార్యక్రమంలో సీపీఎం నేతలు తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, రాందాస్, సర్వన్, వైకుంఠం, సరిత, వెంకన్న, వీరస్వామి, వీరభద్రం, పాషా, హుస్సేన్, సాంకు, కౌసల్య, ఖైరున్, మలేఖ, రమణ, కేస్యా, అమ్మి, ప్రమీల, పద్మ, క్రాంతి, సంతోష్, శాంతి, శంకర్, సుధాకర్, ఉపేందర్, హేమ్లీ తదితరులు పాల్గొన్నారు.

సీఎల్పీ నేత భట్టికి ఘనస్వాగతం

జూలూరుపాడు: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం భద్రాచలం భారీ కాన్వాయ్‌తో వెళుతూ మార్గమధ్యంలో జూలూరుపాడులో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాళోత్ మంగీలాల్ నాయక్, నున్నా కృష్ణయ్య, కొలిపాక శ్రీనివాసరావు, వాంకుడోత్ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న యువకుడు

పాల్వంచ: రక్తదానంతో ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడకోవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక యువసేన అనాథాశ్రమంలో తలసేమియా చిన్నారుల కోసం క్లీన్ అండ్ గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో భట్టు కృష్ణ, పోట్రు ప్రవీణ్, హరిబాబు, శివ, సందీప్, నగేశ్, అశోక్, వినయ్, జగదీశ్, అనిల్, వివేక్, సతీశ్, కృష్ణ, ఉదయ్‌కిరణ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తోలకాలు



ఫారెస్ట్ డిపోలో సీజ్ చేసి ఉంచిన టిప్పర్

పాల్వంచ: తోగ్గూడెం నుంచి మట్టి అక్రమ తోలకాలు అడ్డగోలుగా జరుగుతున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్ ఏరియా నుంచి మట్టి తోలకాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఒక్క టిప్పర్‌ను పట్టుకుని ఫారెస్ట్ డిపోకు తరలించి సీజ్ చేశారు. తోగ్గూడెం నుంచి పాల్వంచకు వస్తున్న క్రమంలో పెద్దమ్మగుడి ఏరియాలో పట్టుకున్నారు. అక్రమ తోలకాలపై ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేస్తే రిజర్వ్ ఫారెస్ట్ నుంచి ఏమేరకు అక్రమంగా తోలకాలు జరిగానే వాస్తవాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. వందలాది లారీల్లో మట్టి తోలకాలు జరిగినప్పటికీ ఏదో ఒక టిప్పర్‌ను మాత్రమే పట్టుకోవడం వెనుక ఆంత్యరమేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఎఫ్ఎస్ఓ సుజాతను వివరణ కోరగా.. దాటవేత సమాధానం ఇచ్చారు. డిప్యూటీ రేంజర్ రమాదేవిని వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

ఉత్సవాలను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

పాల్వంచ: ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు పట్టణంలోని శ్రీ ఆత్మలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శివరాత్రి సమయంలో నేరుగా శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరించే ఆలయంగా రాష్ట్రంలోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందిందన్నారు. కాకతీయుల కాలంలో ఆలయ నిర్మాణం జరిగిందని చరిత్ర చెబుతుందన్నారు. 15,16,17 తేదీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు జరుగుతాయని, 18వ తేదీ రాత్రి ముత్యాల తలంబ్రాలతో శివలీలా కల్యాణ మహోత్సవం జరుగుతుందని, 19న అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగ సీతారాములు, కృష్ణ, నాగర్జున, అప్పారావు, యాకయ్య, కె.సాంబయ్య, అమర్, పిచ్చేశ్వరరావు, వీరన్న, అచ్యుత్‌రావు, వెంకన్న, కొండల్‌రావు, వీరయ్య చౌదరి, రామ్మోహన్ రావు, శ్యామల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీ లేని రుణాలివ్వాలి

ఇల్లెందురూరల్: స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ఇల్లెందులో నిర్వహించనున్న సెర్ప్ మహిళల ప్రదర్శనను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో విస్తతంగా పర్యటించారు. పొదుపు సంఘాల సభ్యులతో సమావేశమై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో స్వయం సహాయక సంఘాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. గతంలో పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఆచరణలో విఫలమయ్యారని విమర్శించారు. అభయహస్తం, జనశ్రీ , ఆమ్ ఆద్మీ యోజన పథకం పునరుద్ధరించాలని, స్త్రీనిధి మహిళా బ్యాంకులను గ్రామస్థాయిలోనే ఏర్పాటు చేయాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఇల్లెందు: మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం కమిషనర్ అంకుషావలీకి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. పట్టణం నుంచి వసూలయ్యే పంపు, ఇంటి పన్నులను ప్రభుత్వానికి జమ చేసి కార్మికుల కడుపు కొడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎంఆర్, కాంట్రాక్ట్ కార్మికులకు డిసెంబర్, జనవరి రెండు నెలల నుంచి జీతాలు అందాల్సి ఉందని తెలిపారు. అధికారులు, చైర్మన్ జోక్యం చేసుకుని వేతనాల అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వీరన్న, వెంకన్న, సంధ్య, యాదయ్యరఫీ, రాజేష్‌రెడ్డి, పాషా, సాల్మాన్‌రాజ్, మల్లయ్య, పద్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆందోళనకు ఇఫ్టూ కార్మిక సంఘం తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు యాకుబ్‌షావలీ నాయకత్వం వహించారు.

ప్రభుత్వం స్పందించే వరకూ ఉద్యమం



దీక్షా శిబిరంలో కొమరారం గ్రామస్తులు

ఇల్లెందురూరల్: ప్రభుత్వం స్పందించి కొమరారంను మండలంగా ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న అన్నారు. కొమరారం గ్రామంలో కొమరారం మండలం ఏర్పాటు లక్ష్యంగా ప్రజాపంథా ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష, అనువుగా వనరులు ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. తమకు బలమున్న చోటే ఎంత చిన్న మండలాలనైనా ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొమరారం విషయంలో గతంలో హామీ ఇచ్చి కూడా దాటవేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాళి కృష్ణవేణి, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా, మల్లిపెద్ది శ్రీనివాస్, శెట్టి నర్సింహారావు, పోలోజు శ్రీనివాస్, కాంపాటి సందీప్, భూక్యా కర్ణ, తేలే కిరణ్, తేజావత్ లక్ష్మణ్, బాదావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు ప్రారంభం

చుంచుపల్లి: మైక్రోఫైలేరియాకు సంబంధించిన రక్తపు నమూనాలకు కొత్తగూడెంలోని టీ హబ్ ల్యాబ్‌లో మంగళవారం పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 9 సైట్‌ల ద్వారా మొత్తం 5,400 సేకరించిన రక్తపు పూతల శాంపిల్స్ పరీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీ హబ్ మేనేజర్ నిజాముద్దీన్, కుమారస్వామి, కృష్ణయ్య, కోటేశ్వరరావు, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



నాట్యం చేస్తున్న విద్యార్థినులు



బహుమతులు అందిస్తున్న ఆనంద్ కిశోర్ కోలా

పాల్వంచ: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, నిర్దిత, నిర్దేశ ప్రణాళికతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్ ఆనంద్ కిశోర్ కోలా అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక నవభారత్ పబ్లిక్ స్కూల్ 43వ వార్షికోత్సవాన్ని నవ కళాభారతీలో ఘనంగా నిర్వహించారు. కిశోర్ మాట్లాడుతూ.. విద్యార్థి సమయపాలన, భిన్న ఆలోచనా ధోరణి ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయన్నారు. విద్యావిలువల సాధనే ధ్యేయంగా, మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ఈ విద్యా సంవత్సరం స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డ్‌కు ఎంపిక కావడం పట్ల అభినందించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీఎంపీ శ్రీనివాస రెడ్డి, నవ లిమిటెడ్ యూనిట్ జనరల్ మేనేజర్ వైపీ శ్రీనివాసరావు, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్ఆర్ శ్యాం సుందర్, ప్రధానోపాధ్యాయురాలు పి.జ్యోతి, విద్యా సమన్వయకర్త ఎ.శ్రీదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కల్వర్టు వద్ద పొంచి ఉన్న ప్రమాదం

పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. కిన్నెరసానికి నిత్యం పర్యాటకులు, విద్యార్థుల రాకపోకలు సాగిస్తారు. గ్రామం ప్రారంభంలో ప్రధాన రహదారి కల్వర్టు వద్ద రోడ్డు పక్కన పెద్ద గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు సమస్యను విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కల్వర్టు వద్ద రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయాలని స్థానికులు, వాహనదారులు, పర్యాటకులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : వంశీ,
ఆర్అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 9603465426